సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 5 । మే । 2023



కలగానే కల్లాలు..

రైతులు ధాన్యం ఆరబోసేందుకు కల్లాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపైనే ధాన్యం ఎండబెడుతూ అవస్థలు పడుతున్నారు.

- 8లో ▸



ఉద్యోగులకు తీవ్ర అన్యాయం

జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని మాజీ మంత్రి షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.3 /20.5

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతం కావచ్చు. సాయంత్రం మోస్తారుగా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన సెన్సార్ బోర్డు సభ్యుడు రామకృష్ణ



కామారెడ్డి టౌన్ : తెలంగాణ రాష్ట్ర సెన్సార్ బోర్డు మెంబర్ అతిమాముల రామకృష్ణ గురువారం ఢిల్లీలో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలో సీఎంను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్ ఉన్నారు.

అంగన్‌వాడీలను మంజూరు చేయండి





బాన్సువాడ : తెలంగాణలోని బాన్సువాడ నియోజకవర్గంలో నూతనంగా 43 అంగన్‌వాడీలను మంజూరు చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి గురువారం కేంద్ర మహిళ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఇందేవార్ పాండేకు వినతిపత్రం అందజేశారు. ఎంపీ బీబీ పాటిల్ కూడా స్పీకర్‌తో ఉన్నారు. వినతి పత్రానికి కేంద్ర కార్యదర్శి సానుకులంగా స్పందించినట్లు స్పీకర్ తెలిపారు. ఉదయం ఢిల్లీలో స్పీకర్ పోచారం జిల్లా అధికారులతో, ప్రజాప్రతినిధులు, రైతులతో ఫోన్‌లో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీఎం ప్రకటించారని, వేగంగా కాంటాలు ఏర్పాటు చేసి మిల్లులకు పంపించాలని అధికారులకు సూచించారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

5171 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్ : జిల్లాలో గురువారం జరిగిన కంటి వెలుగు శిబిరాల్లో 5171 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. అవసరమైన 387 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. దీంతో జిల్లాలో ఇప్పటివరకు 3,72,655 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 55,708 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు.

తడిసిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోవాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



కామారెడ్డి క్రైం : తడిసిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం యాసంగి ధాన్యం కొనుగోళ్లపై బాన్సువాడ నియోజకవర్గ మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన తడిసిన ధాన్యాన్ని మిల్లర్లు దించుకోవాలన్నారు. తడిసిన ధాన్యాన్ని తీసుకోకపోతే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. లక్ష్యానికి అనుకూలంగా మిల్లింగ్ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న తడిసిన ధాన్యాన్ని సహకార, వ్యవసాయ అధికారులు అంచనా వేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల లింగం, ప్రతినిధులు పాల్గొన్నారు.

అధ్వానంగా కలెక్టరేట్‌కు వెళ్లే దారి



కామారెడ్డి అర్బన్: పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన్నంగా ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదు. స్థానిక ఎమ్మెల్యే లేదా మున్సిపల్ పాలకవర్గం కాని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు సైతం ఈ విషయమై పట్టించుకోకపోవడంతో పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాతబస్టాండ్ నుంచి పోసానీపేట వరకు ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో ఈ రోడ్డు ఉంది. రోడ్డు కామారెడ్డి పట్టణంలో ఉన్నందున మున్సిపల్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

■ బాన్సువాడ మండలం తాడ్కోల్‌లో తుమ్మల వెంకటరెడ్డి (55)ని ఆయన భార్య రుక్మిణి రోకలి బండతో మోది హతమార్చింది. ఇరువురి మధ్యన ఆస్తి గొడవలు ఉన్నాయి. ఈ సంఘటనలో భార్యను పోలీసులు అరెస్టు చేశారు.


■ ఎల్లారెడ్డి పట్టణ పరిధిలోని గండి మాసానిపేటలో పోచమ్మ(57)ను కొడుకు, కోడలు కలిసి హతమార్చారు. ఆస్తి విషయంలోనే హత్య జరిగింది. ఊపిరి ఆడకుండా మెత్తను ముఖంపై ఒత్తి చంపారు. ఇరువురినీ పోలీసులు అరెస్టు చేశారు.

■ రాజంపేట మండల కేంద్రంలో కొప్పుల ఆంజనేయులును కూతుళ్లు, మనవడు కలిసి చంపారు. ఇంటికి నిప్పంటించి ప్రమాదం కింద చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఆస్తి వివాదమే హత్యకు కారణమని స్పష్టమైంది.

నెత్తుటి మరకలు!

మానవత్వం మంటగలుస్తోంది. మానవ సంబంధాలు 'మనీ' చుట్టూ తిరుగుతున్నాయి. ఆస్తి కోసం అయినవారే హంతకులవుతున్నారు. కన్నవాళ్లను, తోడబుట్టిన వాళ్లను పొట్టన పెట్టుకుంటున్నారు. ఇటీవలి కాలంలో జరిగిన హత్యలు ఆస్తి వివాదాల నేపథ్యంలో జరిగినట్లు స్పష్టమవుతోంది. కొన్ని వివాహేతర సంబంధాలు కూడా హత్యలకు కారణమవుతున్నాయి.


- జిల్లాలో వారానికో హత్య
- ఆస్తి తగాదాలతోనే ఎక్కువ ఘోరాలు
- అయిన వారే హంతకులవుతున్నారు



సాక్షి, కామారెడ్డి : ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలో 16 హత్యలు జరిగాయి. అంటే వారానికో హత్య జరిగినట్లు స్పష్టమవుతోంది. రక్తపు మరకలు చెదిరిపోకముందే మరో చోట రక్తం పారుతోంది. ఇలాంటి సంఘటనలు సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొన్ని కేసుల్లో నిందితులకు శిక్షలు పడుతున్నాయి. అయినా ఆవేశంలో అన్నీ మరచిపోయి హత్యలకు పాల్పడుతున్నారు. తద్వారా ఇరువురి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

వివాహేతర సంబంధాలు..

హత్యలకు సంబంధించి కేసులను పరిశీలిస్తే ఆస్తి తగాదాలతో పాటు వివాహేతర సంబంధాలు కారణమవుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 16 హత్యలు జరిగాయి. ఇందులో సగానికిపైగా ఆస్తి తగాదాల నేపథ్యంలో జరిగాయి. ఒక చోట భార్య భర్తను హతమార్చగా, మరోచోట కన్న తండ్రిని కూతుళ్లు, మనవడు కలిసి చంపారు. మరో సంఘటనలో తల్లిని కొడుకు, కోడలు చంపేశారు. ఇలా ఆస్తి తగాదాల్లో హత్యలకు పాల్పడుతున్నారు. అలాగే నాలుగైదు హత్యలు వివాహేతర సంబంధాలతో జరిగినట్టు స్పష్టమవుతుంది. వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని ఒకరిని, వివాహేతర సంబంధం పెట్టుకుందని మరొకరిని హతమార్చారు. మాచారెడ్డి మండలం గజ్యానాయక్ తండా శివారులో ఓ మహిళ హత్య జరిగింది. సిరిసిల్లా జిల్లాలో వీఆర్ఏగా పనిచేస్తున్న మహిళను ఇద్దరు బైకుపై తీసుకువచ్చి అత్యాచారం జరిపిన తరువాత హతమార్చారు. ఈ కేసులో నిందితులిద్దరినీ అరెస్టు చేశారు. నస్రుల్లాబాద్ మండలం అంకోల్‌కు చెందిన వ్యక్తి హత్య కేసులో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని హతమార్చారు.



కూర్చొని పరిష్కరించుకోవచ్చు..

కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలకు సంబంధించి న్యాయపరంగా కొట్లాడవచ్చు. కుల పెద్దలు, గ్రామ పెద్దల ద్వారా పరిష్కరించుకునే ప్రయత్నం చేయవచ్చు. ఒక్కోసారి కొందరికి అన్యాయం జరుగుతుంది. అంతమాత్రాన కూర్చుని మాట్లాడకుండా ఆవేశంలో హత్యలకు పాల్పడడం ద్వారా హంతకులవుతున్నారు. ఫలితంగా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

రోడ్డున పడుతున్న కుటుంబాలు..

ఆస్తి కోసం గొడవపడి హత్యలకు పాల్పడుతున్న వారు తప్పించుకునే పరిస్థితులు లేవు. ఎక్కడో చోట ఆధారం దొరికి చిక్కిపోతున్నారు. జైల్లో నెలల తరబడి ఉండాల్సి వస్తోంది. బెయిల్ కోసం పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. బెయిల్‌పై వచ్చినా సమాజంలో వారిని హంతకులన్న ముద్ర వీడడం లేదు. కేసు విచారణ జరిగిన తరువాత శిక్షలు కూడా పడుతున్నాయి. హంతకులన్న ముద్ర పడడంతో పాటు ఆర్థికంగానూ చితికిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అయినప్పటికీ ఆవేశంలో తీసుకుంటున్న నిర్ణయాలు వారి జీవితాలను నాశనం చేస్తున్నాయి. చనిపోయిన వారి కుటుంబాలు కూడా రోడ్డున పడాల్సి వస్తోంది.

ఆర్థికంగానూ చితికిపోతున్నారు. ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు అనర్థాలకు దారితీస్తున్నాయి.

కదం తొక్కిన రైతన్నలు..



కలెక్టరేట్ ఎదుట బారికేడ్లు పెట్టి రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

- జిల్లా కేంద్రంలో రైతులు, ట్రాక్టర్లతో భరోసా ర్యాలీ
- బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి, ధర్నా
- తడిసిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలి : బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్ : అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో గురువారం సుమారు 1200మంది రైతులు కదం తొక్కారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో రైతులు, ట్రాక్టర్‌లతో, ప్లకార్డుల ప్రదర్శనతో భారీ ఎత్తున రైతు భరోసా ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్‌కు తరలివెళ్లి ధర్నా చేపట్టారు. గాంధీ గంజ్ నుంచి ర్యాలీ ప్రారంభమై సిరిసిల్లారోడ్, స్టేషన్ రోడ్, రైల్వే బ్రిడ్జి మీదుగా నిజాంసాగర్ చౌరస్తాలో కొద్దిసేపు ధర్నా చేశారు. అక్కడి నుంచి కొత్తబస్టాండ్, అశోక్‌నగర్ కాలనీ, రైల్వే గేట్ మీదుగా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. అక్కడే బైఠాయించి ధర్నా చేపట్టారు. పోలీసులు ముందస్తు గా భారికేడ్లు ఏర్పాటు చేసి భారీ బందోబస్తు చేపట్టారు. రైతులు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. 10 మంది రైతులకు అనుమతి ఇవ్వడంలో లోపలికి వెళ్లి కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రతి గింజను కొనాలని వేడుకున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో వడగండ్లతో నష్టపోయిన రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని, తడిసిన ధాన్యమంతా బేషరతుగా కొనుగోలు చేయాలని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ఎకరాకు రూ. 50 వేలు, నేల కొరిగి దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ. 25 వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు.



కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు



జిల్లా కేంద్రంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

విలపించొద్దు.. అండగా ఉంటాం

- రైతులకు ప్రభుత్వ విప్ గంప హామీ
- ద్విచక్రవాహనంపై వెళ్లి వర్షాలకు దెబ్బతిన్న పొలాల పరిశీలన

కామారెడ్డి రూరల్: అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన వారెవ్వరూ విలపించొద్దు. ధైర్యంగా ఉండండి అండగా మేముంటాం అని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ రైతులకు హామీ ఇచ్చారు. పంట తీవ్రంగా నష్టపోయి విలపిస్తున్న మండలంలోని లింగాయిపల్లికి చెందిన రైతును ఆయన ఓదార్చి ధైర్యం చెప్పారు. గురువారం మండలంలోని లింగాయిపల్లి, కోటాల్‌పల్లి, నర్సన్నపల్లి గ్రామాల్లో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటను ఆయన పరిశీలించారు. పంట నష్టం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులను ఆదుకుంటామన్నారు. ఒక గుంట పంట నష్టపోయినా నివేదికలో పొందుపర్చాలని అధికారులకు సూచించారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆయా గ్రామాల్లోని వరి పంట పొలాలకు బైక్‌పై వెళ్లి పరిశీలించారు. అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, సింగిల్ విండో చైర్మన్ పాత లక్ష్మణ్, ఏఎంసీ చైర్మన్ పిప్పిరి వెంకటి, మాజీ ఏఎంసీ చైర్మన్ గోపిగౌడ్, సర్పంచ్‌లు అపర్ణ, మంజుల, హన్మాండ్లు, ఏడీఏ అపర్ణ తదితరులున్నారు.



లింగాయిపల్లిలో విలపిస్తున్న రైతును ఓదారుస్తున్న ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్, అధికారులు

ఇరుకు ఆస్పత్రితో ఇబ్బందులెన్నో?

- కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో అరకొర సౌకర్యాలు
- 130 పడకలకే వసతులు కరువు
- అదనంగా 100 బెడ్ల కోసం రెండో అంతస్తులో నిర్మాణం
- సౌకర్యాల్లేకుండానే పడకలు పెంచడంపై అసహనం



ఆస్పత్రిలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు కావడం, ఈ ఏడాదే ప్రారంభం కానుండడంపై జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకోసం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిని మెడికల్ కళాశాల జనరల్ ఆస్పత్రిగా మారుస్తున్నారు. అయితే సౌకర్యాలు మెరుగుపర్చకుండానే ఆస్పత్రిలో పడకలు పెంచడంపై రోగుల బంధువులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆస్పత్రి భవనం ఇరుకుగా ఉంది. ఆస్పత్రిలో ఉన్న విభాగాలకు స్థలం సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడున్న 130 పడకలకు అదనంగా మరో 100 పడకల కోసం రెండో అంతస్తులో రేకుల షెడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే పనులు పూర్తయి మెడికల్ కళాశాల వైద్య సేవలు ప్రారంభం కానున్నాయి. అయితే 230 పడకలతో ఆస్పత్రి మరింత ఇరుకుగా మారే అవకాశాలున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కూర్చుని తినేందుకు జాగా లేదు..

ఇప్పటికే ఆస్పత్రిలో తాగునీటి సౌకర్యం లేక బయట నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. రోగులు, వారి బంధువులు తినడానికి స్థలం కూడా లేదు. బెడ్ల వద్ద, బయటదారుల్లో తినాల్సిన పరిస్థితులు ఉన్నాయి. నీరు సరిపోక బాత్‌రూంలు కంపు కొడుతున్నాయి. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల వాహనాలు పెట్టేందుకే స్థలం లేకుండా పోయింది. దీనికి తోడు అంబులెన్స్‌లు, రోగుల కార్లు, బైక్ పార్కింగ్‌కు స్థలం సరిపోక ఆస్పత్రి ముందు రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు.

పడకలు పెరిగితే..

కామారెడ్డి ఏరియా ఆస్పత్రి మొదట్లో 100 పడకలు ఉండేవి. నాలుగేళ్ల క్రితం మెటర్నిటీ సేవల కోసం మరో 30 పడకలను రేకుల షెడ్‌తో నిర్మించారు. ప్రస్తుతమున్న 130 పడకలకే సరైన రీతిలో సేవలందట్లేదు. ఇక 230 పడకలతో మెడికల్ కళాశాల ప్రారంభమైతే ఇంకెన్ని ఇబ్బందులు పడాలోనని ప్రజలు వాపోతున్నారు.

మెరుగైన సేవల కోసమే..

జిల్లాలో త్వరలోనే కళాశాల ప్రారంభం కానుంది. జిల్లా కేంద్ర ఆస్పత్రి భవనం ఇరుకుగా ఉండటం వాస్తవమే. మెడికల్ కళాశాలకు కొత్త భవన నిర్మాణం చేపట్టి పూర్తయ్యేవరకు ఇక్కడే 230 పడకలతో వైద్య సేవలు అందిస్తాం. రోగులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వం

– విజయలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్, కామారెడ్డి

అన్నదాతకు తరుగు దెబ్బ

- పెరిగిపోతున్న రైస్‌మిల్లర్ల ఆగడాలు
- క్వింటాలుకు 3 కిలోలు కట్..!
- స్పీకర్ దగ్గరుండి రైస్‌మిల్‌కు పంపినా తిరస్కరించిన యజమాని

బాన్సువాడ : బాన్సువాడ పట్టణానికి చెందిన ఓ రైతు ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రంలో 254 బస్తాలను కాంట చేయించాడు. తూకం చేసేటప్పుడు 40 కిలోల బస్తాకు 41.650 గ్రాములను తూకం చేశారు. అంటే క్వింటాలుకు 3 కిలోలు తూకం చేసేటప్పుడే కట్ చేశారు. ఇలా 254 బస్తాలకు 3 కిలోల చొప్పున 300 కిలోలు రైతు నష్టపోవాల్సి వచ్చింది. అంటే రూ. 6 వేలు నష్టపోయాడు. తూకం చేసిన ధాన్యం బస్తాలు రైస్‌మిల్లుకు వెళ్లగానే మిల్లర్ల యజమానులు కొర్రీలు పెడుతూ లారీకి 5 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్ల వరకు కట్ చేసి అన్‌లోడ్ చేసుకుంటున్నారు. దీంతో రైతులకు రెండు విధాలుగా నష్టం జరుగుతోంది.

అకాల వర్షం.. ఆపై దోపిడీ..

మరో పక్క లారీ యజమానులు కూడా లారీల కృత్రిమ కొరత సృష్టించి బస్తాకు రూ. 2 చొప్పున రైతుల వద్ద వసూలు చేస్తున్నారు. అవి చెల్లించిన ధాన్యాన్నే మిల్లులకు తరలిస్తున్నారు. అకాలవర్షానికి ధాన్యం తడిసిందని సాకు చూపుతూ లారీకి రూ. 5 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్ల వరకు తక్కువ చేసి తూకం చేసి ఆన్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటికే హమాలీ ఖర్చుల భారంతో రైతు కుదేలైతే మరోవైపు వివిధ రకాల్లో రైతులను అవస్థలు పెడుతున్నారు.

తేమ ఎక్కువ ఉందని..

నాలుగు రోజుల క్రితం రాత్రి సమయంలో బాన్సువాడ పట్టణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. రాత్రయ్యే సరికి హమాలీలు వెళ్లిపోగా మళ్లీ వారిని పిలిపించి ధాన్యం తూకం వేయించి రాత్రే రైస్‌మిల్లుకు పంపారు. అయితే సదరు రైస్‌మిల్లరు ఆ ధాన్యాన్ని ఉంచుకుని తేమశాతం ఎక్కువగా ఉందని తిరిగి పంపించేశారు. దీంతో ఆ ధాన్యాన్ని మరో రైస్‌మిల్‌కు అధికారులు పంపి అన్‌లోడింగ్ చేయించారు. ఇలా స్పీకర్ దగ్గరుండి పంపిస్తే రైస్‌మిల్లరు నిర్లక్ష్యం చేయడాన్ని సర్వత్రా చర్చించుకుంటున్నారు.



బాన్సువాడలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిల్వలు

బెదిరిస్తున్నారు..

నిర్ణీత తేమ శాతం వచ్చినప్పటికీ 40 కిలోల బస్తాకు 41.650 గ్రాములకు ధాన్యాన్ని తూకం చేస్తున్నారు. తూకం వేసిన ధాన్యం రైస్‌మిల్లుకు పంపిస్తే 4 క్వింటాళ్ల ధాన్యం కట్ చేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే లారీని తిప్పి పంపిస్తామని అని బెదిరిస్తున్నారు.

– గంగారం, రైతు బాన్సువాడ

నాలుగు బస్తాలు కట్ చేశారు..

మూడు రోజుల క్రితం 345 బస్తాలను తూకం చేసి రైస్‌మిల్లుకు పంపితే 4 బస్తాల ధాన్యాన్ని కట్‌చేసి మిగితా ధాన్యం బస్తాలకు బిల్లు కట్టారు. గంగా కావేరి ధాన్యంలో అసలు పొల్లు అనేది లేకుండా తూకం చేశారు. – గంగాధర్, రైతు, బాన్సువాడ

పెరుగుతున్న హమాలీ భారం

- జిల్లాలో రూ. 14.64 కోట్ల బకాయిలు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

ఎల్లారెడ్డిరూరల్ (ఎల్లారెడ్డి) : మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంలో మారింది రైతుల పరిస్థితి.. అకాల వర్షాల కారణంగా పంటలను నష్ట పోయిన రైతన్నపై హమాలీ చార్జీల భారం మరింత ఇబ్బందిగా మారిందని వారు ఆవేదన చెందుతున్నారు. 9 పంటలకు సంబంధించిన హమాలీ చార్జీలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆందోళన చెందుతున్నారు. 2009లో దివంగత సీఎం వైఎస్సార్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులకు వారి ఖాతాల్లో ప్రభుత్వం 2009 నుంచి 2017వ వరకు హమాలీ చార్జీలను క్వింటాలుకు రూ. 5.91 చొప్పున వేశారు. 2017 నుంచి 2023 వరకు 9 పంటలకు సంబంధించి హమాలీ చార్జీలు రైతులకు రూ. 14.64 కోట్లు రావాల్సి ఉంది. హమాలీ చార్జీలు ప్రస్తుతం రూ. 35 నుంచి రూ. 40 చెల్లిస్తున్నామని రైతులంటున్నారు.



ఎల్లారెడ్డిలో ధాన్యం కాంటా చేస్తున్న హమాలీలు

నాలుగేళ్లుగా రావట్లేదు..



నాలుగేళ్లుగా హమాలీ చార్జీలు రావడం లేదు. నాలుగేళ్ల క్రితం హమాలీ చార్జీలు బ్యాంక్ ఖాతాలో జమ కావడం జరిగింది. అప్పటి నుంచి ఇంత వరకు ఒక్క రూపాయి కూడా హమాలీ చార్జీ రాలేదు.

– సంగయ్య, రైతు, ఎల్లారెడ్డి

రైతుల ఖాతాలో జమవుతాయి..

హమాలీ చార్జీలు రైతుల ఖా తాలో జమవుతాయి. రైతుల కు సంబంధించి హమాలీ చా ర్జీల వివరాలను ప్రతి పంటకు సంబంధించి ప్రభుత్వానికి పంపుతున్నాం. ప్రభుత్వం రై తుల ఖాతాలో హమాలీ చార్జీలను జమ చేస్తుంది.

– విశ్వనాథం, ఎల్లారెడ్డి సొసైటీ కార్యదర్శి

క్లుప్తంగా

రైతులు అధైర్య పడొద్దు



రుద్రూర్: గత వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులు అధైర్య పడొద్దని డీసీవో సింహాచలం భరోసా కల్పించారు. కోటగిరి మండలంలోని కోటగిరి, పోతంగల్, జలపల్లి శివారులో పంట పొలాలను, రోడ్లపై ఆరబెట్టిన వరి ధాన్యాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అకాల వర్షాల వల్ల తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళనకు గురికావద్దని సూచించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, నాయకులు కిషోర్‌బాబు, విజయ్‌పటేల్, సర్పంచ్ మాధవరావు, ఉమా రాంబాబు, విట్టల్ ఉన్నారు.

క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డీఏవో(జిల్లా వ్యవసాయశాఖ అధికారి) వీరస్వామి సూచించారు.మండలంలోని మర్కల్, తిర్మన్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, వర్షాలకు దెబ్బతిన్న పంటలను గురువారం ఆయన పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి ఏయే పంటలు ఎన్ని ఎకరాల్లో నష్టం వాటిల్లిందో నివేదిక తయారు చేసి పంపించాలని సూచించారు. సర్పంచ్ సంగారెడ్డి, ఉప సర్పంచ్ రాజిరెడ్డి, ఏవో ప్రజాపతి పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ బలోపేతానికి కృషి



ఖలీల్‌వాడి: జిల్లాలో వైఎస్సార్ టీపీ బలోపేతానికి కృషి చేస్తామని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యవతి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నిజామాబాద్ అర్బన్ ఇన్‌చార్జిగా ఉన్న బుస్సాపూర్ శంకర్ పార్టీని వీడినా వైఎస్సార్ టీపీకి ఎలాంటి నష్టం లేదన్నారు. శంకర్‌తో బీజేపీలోకి ఎవరూ వెళ్లలేదన్నారు. శంకర్‌కు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు ఇచ్చినా పార్టీ బలోపేతానికి కృషి చేయకపోవడంతో జిల్లా అధ్యక్షుడిగా గౌతంప్రసాద్‌ను నియమించినట్లు తెలిపారు. అలాగే తెలంగాణ ప్రజలు పార్టీ అధినేత్రి షర్మిలా పాదయాత్రకు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. నాయకులు గౌతం ప్రసాద్, మోహన్, లావణ్య, జగన్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితులు?

ఇందల్వాయి: మండలంలోని డొంకల్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో గత శనివారం హత్యకు గురైన మోపాల్ మండలం కాస్‌బాగ్ తండాకు చెందిన గోపాల్ హత్య కేసులో ప్రధాన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. నిందితుల్లో మృతుడి భార్యతో పాటు మోపాల్ మండలం బాడ్సి గ్రామానికి చెందిన వ్యక్తితో పాటు, గొరారం గ్రామానికి చెందిన అతని మిత్రుడు ఉన్నట్లు సమాచారం. అక్రమ సంబంధం, భూవివాదమే హత్యకు కారణమని తెలుస్తోంది.

కలగానే కల్లాలు.. కష్టాల్లో రైతులు

- పొలాలు, రోడ్లపైనే ధాన్యం ఆరబోత
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ సౌకర్యాలు కరువు
- పట్టించుకోని అధికారులు

నిజాంసాగర్/నస్రుల్లాబాద్(బాన్సువాడ): పిల్లలు ఆడుకోవడానికి ఆట స్థలాలను, మొక్కలు నాటడానికి నర్సరీలను ఏర్పాటు చేసి స్థలం కేటాయించే ప్రభుత్వం.. అన్నం పెట్టే రైతులు ధాన్య ఆరబోయడానికి మాత్రం స్థలం చూపడం లేదు. దీంతో అన్నదాతలు ధాన్యాన్ని ఆరబోసేందుకు కష్టాలు పడుతున్నారు. రైతులు ధాన్యం ఎండబెట్టడానికి ఎఫ్‌సీఐ స్థలం ఏర్పాటు చేయడంలో విఫలం అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేయడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. కానీ ధాన్యం ఎక్కడ నిల్వ ఉంచాలి, ఆరబెట్టాలి అని స్థలం చూపడం లేదని వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సిమెంట్ ఫ్లాట్ ఫారాలు లేకపోవడంతో అకాల వర్షాలతో ధాన్యం తడవడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

అకాల వర్షాలతో నష్టాలు..

జిల్లాలో 2.5లక్షల ఎకరాల్లో వరి పంటను పండించడంతో 4లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం సేకరణ లక్ష్యంగా 342 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ధాన్యం సేకరణకు కావాల్సిన 20 లక్షల గన్నీ బస్తాలను సివిల్ సప్లయ్ అధికారులు సరఫరా చేశారు. కానీ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలకు సంబంధించిన సిమెంట్ ఫ్లాట్ ఫారాలు లేవు. అలాగే కొనుగోలు కేంద్రాల నిర్వహణకు అనువైన స్థలాలు లేకపోవడంతో పంట పొలాల్లో, రోడ్ల వెంబడి ధాన్యాన్ని కుప్పలు పోస్తూ ఆరబెడుతున్నారు. దీంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నాయి. అలాగే రోడ్లపై ధాన్యాన్ని కుప్పలు పోసి ఆరబెడుతుంటే రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి.



నస్రుల్లాబాద్‌లోని ఓపెన్ ప్లాట్లల్లో ధాన్యం కుప్పలు



నిజాంసాగర్ మండలంలో రోడ్ల పక్కన..

కమీషన్ల కోసమే కాంటాలు?

వరి ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరను కల్పిస్తుండటంతో సహకార సంఘాలు, ఐకేపీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నారు. కానీ కొనుగోలు కేంద్రాల వద్ద వసతుల కల్పనపై నిర్వహకులు దృష్టి సారించడం లేదు. ధాన్యానికి రక్షణగా టాపర్లు సరఫరా చేయకపోవడం, టెంటు, తాగునీటి సదుపాయం కల్పించడం లేదు. ధాన్యం సేకరణ చేస్తూ, కమిషన్ డబ్బుల కోసం సొసైటీలు, ఐకేపీలు పబ్బం గడుపుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలని, ధాన్యం ఆరబోత కోసం కల్లాలను నిర్మించాలని అన్నదాతలు కోరుతున్నారు.

మొలకలు వస్తున్నాయి..



వరి కోతకోసి కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న పొలాల్లో కుప్పలు పోశాం. వర్షాలు పడుతుండడంతో వడ్లను ఆరబెట్టలేకపోతున్నాం. దీంతో మొలకలు వస్తున్నాయి. అధికారులు సౌకర్యాలు కల్పించాలి. – సుశీల, మహిళా రైతు, నిజాంసాగర్

రోడ్లమీద పోయనిస్తలేరు..



ఆరుగాలం కష్టపడి పంట పండించినా, అకాల వర్షాలు ఆగం చేస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు లేవు. రోడ్ల మీద ఆరబెడదామంటే పోలీసులు పోయనిస్తలేరు. కేసులు పెడతమంటున్నరు. – మంద శ్రీనివాస్‌రెడ్డి, రైతు, అన్నాసాగర్

స్థలం లేక ఇబ్బందులు..



కోత కోసిన ధాన్యం ఆరబెట్టడానికి స్థలం లేక ఇబ్బందులకు గురి అవుతున్నాం. ప్రైవేటు ప్లాట్లల్లో ఆరబెట్టడం వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి ఎఫ్‌సీఐ స్థలం ఏర్పాటు చేయాలి. –అక్బర్, రైతు, నస్రుల్లాబాద్

అధికారులు స్పందించాలి..



వరి ధాన్యంను ప్రైవేటు ప్లాట్లల్లో ఆరబెడుతున్నాం. మరికొన్ని రోజుల్లో ప్లాట్లు కాస్త విక్రయిస్తే ఆ స్థలం కూడా ఉండదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి స్థలాలను ఏర్పాటు చేయాలి. –పోచయ్య, రైతు, నస్రుల్లాబాద్

ఐకమత్యంతోనే హక్కుల సాధన

- టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్
- అంగన్‌వాడీల జిల్లా కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్: అంగన్‌వాడీ ఉద్యోగులందరూ ఐకమత్యంగా ఉన్నప్పుడే హక్కుల సాధన పరిపూర్ణమౌతాయని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ పేర్కొన్నారు. నగరంలోని టీఎన్‌జీవో కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అలుక కిషన్ మాట్లాడుతూ.. ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయంటే అంగన్‌వాడీ ఉద్యోగులు ఐకమత్యంగా ఉన్నారనే సంకేతాలు సమాజానికి ఇచ్చారని తెలిపారు. ఏమైనా సమస్యలుంటే ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.

నూతన కార్యవర్గం..

అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా తార, ప్రధాన కార్యదర్శి అనురాధ, కోశాధికారి లక్ష్మీ సహా 16మంది ఎన్నికయ్యారు. సంఘ సభ్యులు నిర్మల, శ్రీలత, విజయలక్ష్మీ, టీఎన్‌జీవో జిల్లాకార్యదర్శి శేఖర్, సహాధ్యక్షుడు చిట్టి నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ టీచర్ల నూతన కార్యవర్గంతో టీఎన్‌జీవో నాయకులు

ఏఈఈ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- అభ్యర్థులు నిర్ణీత సమయానికంటే ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సుభాష్‌నగర్: వివిధ శాఖల్లో సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పోస్టుల భర్తీ కోసం టీఎస్‌పీఎస్‌సీ ద్వారా ఈనెల 8, 9 తేదీల్లో జరగనున్న సీబీఆర్టీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికంటే ముందే తమకు కేటాయించిన పరీక్షకేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈమేరకు అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో గురువారం పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై చర్చించేందుకు సంబంధిత శాఖల అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌లతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. 8న ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఏఈఈ పోస్టులకు, 9న మెకానికల్ అండ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ ఏఈఈ పోస్టులకు పరీక్ష ఉంటుందని వివరించారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు జరిగే పేపర్–1 పరీక్షకు అభ్యర్థులు ఉదయం 9.30గంటల్లోపు కేంద్రాల వద్దకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించబోమని స్పష్టం చేశారు. మధ్యాహ్నం 2.30నుంచి 5వరకు జరిగే పేపర్–2 పరీక్షకు 2గంటల వరకే కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. జిల్లాలో సీబీఆర్టీ పరీక్ష నిర్వహణ కోసం మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఆర్మూర్‌లోని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాల, నగరశివారులోని కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఫర్ వుమెన్(కిట్స్), నగరంలోని బోధన్ రోడ్డు ఏవీ ఎంటర్ ప్రైజెస్ (నాలెడ్జి పార్క్) కేంద్రాల్లో పరీక్షలు ఉంటాయన్నారు. అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. బస్టాండ్లలో అభ్యర్థుల సౌకర్యార్థం హెల్ప్–డెస్క్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఇన్విజిలేటర్లను నియమించి పరీక్షల నిర్వహణ, విధుల గురించి స్పష్టమైన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాల పనితీరు ముందుగానే సరిచేసుకోవాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. ప్రాథమిక చికిత్స నిర్వహణపై అవగాహన కలిగిన ఏఎన్‌ఎంలను ఎగ్జామ్ సెంటర్లలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. టీఎస్‌పీఎస్‌సీ నిబంధనలు పాటిస్తూ, సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదనపు పోలీస్ కమిషనర్ మధుసూదన్ రావు, ఆర్టీసీ ఆర్‌ఎం ఉషాదేవి, వివిధ శాఖల అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

తెయూ సమాచారం..

● కొనసాగుతున్న బీఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం నిర్వహించిన పరీక్షకు 871 మంది విద్యార్థులకు గానూ 825 మంది హాజరు కాగా, 46 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో

● డిగ్రీ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజును ఈనెల 10లోపు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు జూన్ నెలలో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. డిగ్రీ (బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ) బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఈ నెల 10 తుది గడువని తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో 13వరకు, రూ.500 అపరాధ రుసుముతో 15వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని కంట్రోలర్ తెలిపారు.

● ఉర్దూలో అబ్దుల్ కుద్దూస్‌కు డాక్టరేట్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగంలో పరిశోధకుడు మహమ్మద్ అబ్దుల్ కుద్దూస్ పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. తెయూ ఉర్దూ విభాగాధిపతి అసోసియేట్ ప్రొఫెసర్ గుల్–ఏ–రాణా పర్యవేక్షణలో 'యూసుఫ్ నాజీమ్ బాహ్యాసియత్ తంజ్ ఓ మీజాహ్ నిగార్' అనే అంశంపై కుద్దూస్ పరిశోధన గ్రంథం సమర్పించారు.



గురువారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్ లో నిర్వహించిన ఓపెన్ వైవాకు తిరుపతి శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ ఉర్దూ ప్రొఫెసర్ మహమ్మద్ నిసార్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. బీవోఎస్ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ ఖవి, ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కనకయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

● హిందీలో సంజయ్ కుమార్ చౌహాన్‌కు..



తెలంగాణ యూనివర్సిటీ హిందీ విభాగంలో పరిశోధకుడు సంజయ్ కుమార్ చౌహాన్ పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. తెయూ హిందీ విభాగాధిపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎండీ జమీల్ అహ్మద్ పర్యవేక్షణలో 'ఇక్కిసవీ సదీకే ఆదివాసీ హిందీ కేంద్రిత్ హిందీ ఉపన్యాసోంమే సామాజిక్ యధార్థ్' అనే అంశంపై సంజయ్‌కుమార్ పరిశోధన గ్రంథం సమర్పించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్‌లో జరిగిన ఓపెన్ వైవాకు మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ కరణ్‌సింగ్ ఉత్వాల్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు.

ఒకరిపై పీడీ యాక్టు నమోదు

కామారెడ్డి క్రైం: తరచుగా దొంగతనాలకు పాల్పడుతున్న ఓ నేరస్తుడిపై కామారెడ్డి పోలీసులు పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. బాన్సువాడ దాల్మల్ కుచ్చ ప్రాంతానికి చెందిన దండుగుల ఎల్లప్ప అలియాస్ ఒల్లెపు శ్రీనివాస్ కొద్దిరోజులుగా జిల్లా కేంద్రంలోని బతుకమ్మకుంటలో నివాసం ఉంటూ తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడేవాడు. అతనిపై కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌లో 7, దేవునిపల్లి స్టేషన్‌లో 1 దొంగతనం కేసులు ఉన్నాయి. ప్రస్తుతం అతడు జైలులో ఉన్నాడు. చంచల్‌గూడ సెంట్రల్ జైల్‌లో ఉన్న అతడికి బుధవారం పీడీయాక్ట్ కింద ఉత్తర్వులను కామారెడ్డి పోలీసులు అందజేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

డిచ్‌పల్లి: రోడ్డుప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. డిచ్‌పల్లి ఎస్సై గణేష్ తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్ ముదిరాజ్ వీధికి చెందిన స్నేహితులు అరుణ్ తేజ్(22), నరేష్ గత నెల 29న రాత్రి బైక్‌పై డిచ్‌పల్లి వెళ్లి, తిరిగి నిజామాబాద్‌కు బయలుదేరారు. నడిపల్లి వద్ద వీరి బైక్‌ను డీసీఎం వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టడంతో అరుణ్‌తేజ్, నరేష్ గాయపడ్డారు. అరుణ్‌తేజ్‌ను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. నరేష్, అతడి సోదరుడు ఉదయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కేజీబీవీలో బదిలీల కోసం..

నిజామాబాద్‌అర్బన్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న వారు బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్టీలు, సీఆర్‌టీలు, అకౌంటెంట్లు, ఏఎన్‌ఎంలు బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 6నుంచి 9వ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నడుస్తున్న కేజీబీవీల్లో తాత్కాలిక పద్ధతిపై పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు, పీజీసీఆర్‌టీలు, సీఆర్‌టీలు, ఏఎన్‌ఎంలు, అకౌంటెంట్లు, పీఈటీలు బదిలీల కోసం ఈనెల 9వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో బదిలీల ప్రక్రియ ఉన్నందున జాగ్రతగా పూర్తి చేయాలని సూచించారు. సమగ్ర శిక్షా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని వివరించారు.

వసతి గృహాల్లో ప్రవేశాలకు..

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 2023– 24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీసీ వసతి గృహాల్లో ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ హాస్టల్లో అడ్మిషన్ పొందు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ప్రస్తుతం చదువుతున్న తరగతి బోనాఫైడ్, ఆధార్ సర్టిఫికెట్, గత సంవత్సరం తరగతి మార్కుల మెమో, కుల ధ్రువీకరణ పత్రము, ఆధాయ ధ్రువీకర ణపత్రంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పిల్లల వైద్యుడి పోస్టుకు..

నిజామాబాద్ సిటీ: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఎస్ఎన్‌సీయూ(ఎన్‌హెచ్‌ఎం) విభాగంలో ఖాళీగా ఉన్న పిల్లల వైద్యుడి పోస్టు భర్తీకి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెలా 5నుంచి 10వరకు కొత్త కలెక్టరేట్ భవనంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం రూం నంబర్ 201లో దరఖాస్తులు అందజేశాలన్నారు. దరఖాస్తు ఫారాలను వెబ్‌సైట్ nizamabad. telangana. gov. in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని బాన్సువాడ ఎంసీహెచ్ సెంటర్‌లో నేషనల్ హెల్త్ మిషన్ కింద ఎంఎస్‌వోబీజీ లేదా డీజీవో రెండు పోస్టుల ఏడాది కాలానికి తాత్కాలిక భర్తీ కోసం అర్హులైన వైద్యుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 8వరకు తన కార్యాలయంలో అందజేయాలని, నిబంధన మేరకు కలెక్టర్ నియామకం చేస్తారని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. జక్రాన్‌పల్లి మండలంలో ఆటో బోల్తాపడగా ఒకరు మృతిచెందారు. ఏడుగురికి గాయాలయ్యాయి. అలాగే నిజాంసాగర్ మండలంలో కారు బోల్తాపడగా ఒకరు మృతిచెందారు. పలువురికి గాయాలయ్యాయి.



బోల్తా పడ్డ ఆటో.. (ఇన్‌సెట్‌లో) మృతిచెందిన భోజన్న (ఫైల్)

జక్రాన్‌పల్లి: ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో ఒకరు మృతి చెందగా ఏడుగురికి స్వల్ప గాయాలైన ఘటన మండలంలోని అర్గుల్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన పలువురు గురువారం ఆలూరులో బంధువులను పలకరించడానికి ఆటోలో బయలు దేరారు. మండలంలోని అర్గుల్ గ్రామ శివారులోగల 44 నెంబర్ జాతీయ రహదారిపై వీరి ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ నచ్చల భోజన్న(30) తీవ్రంగా గాయపడగా, అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న కలిగోట్ గ్రామానికి చెందిన గుండేటి మల్లవ్వ, విజయ, యమునా, జ్యోతి, యమునా, మల్లవ్వ, వినోదలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు డ్రైవర్ భోజన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు బోల్తాపడి..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని నర్సింగ్‌పల్లి చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు కారు బోల్తా పడటంతో ఒకరు మృతిచెందగా, పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా.. సంగారెడ్డికి చెందిన ఐదుగురు వ్యక్తులు కారులో నారాయణఖేడ్‌కు బయలు దేరారు. కారీ సదరు వాహనం దారి తప్పడంతో నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లి చౌరస్తా వరకు వచ్చి తిరిగి వెనక్కి బయలు దేరారు. వెనక్కి మళ్లిన కొన్ని క్షణాల్లో సదరు వాహనం అదుపుతప్పి పల్టీలు కొట్టింది. దీంతో వాహనంలోని ఐదుగురికి గాయాలు కావడంతో నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో సాయివిక్రమ్(23) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.



బోల్తా పడిన కారు

యువకుడి హత్య కేసులో ఇద్దరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రభాకర్ రావ్

భీమ్‌గల్: మండలంలోని కారెపల్లి గ్రామానికి చెందిన బంతిలాల్‌ను కొట్టి చంపిన కేసులో ఇద్దరు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌రావ్ తెలిపారు. భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇటీవల బంతిలాల్ తన ఇంటికి దగ్గరలోని రోడ్డుపై అడ్డంగా కట్టెలు వేశారని నిందిస్తూ వాట్సాప్ గ్రూపులో మెసేజ్ చేశాడు. దీంతో ఆగ్రహానికి గురైన ధరవత్ మంగ్య, దేవిచంద్, అంబాలి, లలిత, లావణ్యలు మంగళవారం రాత్రి బంతిలాల్‌ను చూసి ఆగ్రహంతో అతడిపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న బంతిలాల్ భార్య అతడిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో మృతుడి భార్య నవీన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, ఎస్ఐ రాజ్ భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. నిందితులైన మంగ్య, దేవిచంద్‌లను సుదర్శన్‌నగర్‌తండా వద్ద పట్టుకున్నారు. లావణ్య, లలిత, అంబాలీలు పరారీలో ఉన్నారని, వారిని త్వరలో పట్టుకుంటామని ఏసీపీ వెల్లడించారు.

వాహనం చోరీ కేసులో..

భీమ్‌గల్: పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఈ నెల 2న నిలిపి ఉంచిన తుఫాన్ వాహనాన్ని చోరీ చేసిన ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఆర్మూర్ ఏసీపీ ప్రభాకర్‌రావ్ తెలిపారు. భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ముల్క రాజేశ్వర్‌కు చెందిన టీఎస్ 06యూబీ 1461 నంబర్ గల తుఫాన్ వాహనాన్ని పెట్రోల్ బంకు వద్ద నిలపగా.. నిజాంసాగర్ మండలం చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన ఎల్లారి మధ, మార్ల గంగారం అపహరించారు. దీంతో వాహన యజమాని ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు. 3న నిందితులను పట్టుకొని విచారించి రిమాండ్ చేసినట్లు వెల్లడించారు. ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్ఐ రాజ్ భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డికి చెందిన ఓ యువకుడు మనస్తాపం చెంది బుధవారం రాత్రి హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన ఆకుల సాయికిరణ్(30) హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్టలో ఉంటూ, ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కానీ ఉన్నత చదువులు చదివినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగం రాకపోవడంతో సాయికిరణ్ మనస్తాంపం చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వారు తెలిపారు.